క్లుప్తంగా

డీఎంహెచ్ఓకు సన్మానం



డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

నల్లగొండ టౌన్ : ఇటీవల నూతనంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌ను శుక్రవారం నీలగిరి ఐఎంఏ ప్రతినిధులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, డాక్టర్లు పుల్లారావు, వసంతకుమారి, గౌరీశ్రీ, సుచరిత, అరుంధతి, రాజేశ్వరి, శ్రీకాంత్‌రెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నందుకు తెలంగాణ గణితఫోరం జిల్లా అధ్యక్షుడు అద్దంకి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ ,టీఎంఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి కృష్ణ, రాష్ట్ర బాధ్యులు ఇమ్మడి రాము, స్వామి, జనార్దన్. జిల్లా బాధ్యులు అమరేందర్, అంజయ్య, సైదులు, యాదయ్య ,రాస మల్ల శేఖర్,రఫి, గుంటుక గోవర్ధన్. మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

బీమా కార్యాలయం మార్పు

నల్లగొండ టౌన్ : జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ బీమా కార్యాలయం నల్లగొండ శాఖను మిర్యాలగూడ రోడ్డు బీటీఎస్ నుంచి పాత జిల్లా పరిషత్ కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్ ఎడమ వైపు భవనంలోకి మార్చినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పి.మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పాలసీదారులు గమనించాలని కోరారు.

మామిడాలలో వైద్య శిబిరం

తిప్పర్తి: మాజీ జెడ్పీటీసీ పాశంరాంరెడ్డి సహకారంతో కామినేని వైద్య బృందం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మామిడాల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మార్కెట్ చైర్మన్ జూకురి రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సుధీర్, అంబేద్కర్, జాకటి మోష, కరుణాకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఫీవర్ సర్వే



గుండ్రాంపల్లిలో ఫీవర్ సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ జయలక్ష్మి

చిట్యాల: మండలంలోని గ్రామాల్లో ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చిట్యాల ఎంపీడీఓ ఎస్పీ.జయలక్ష్మి పేర్కొన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫీవర్ సర్వేలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి రోజు యాభై ఇళ్లలో వైద్య, పంచాయతీ, ఐసీడీఎస్ సిబ్బందితో ఫీవర్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, అగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ మండలంలో ఫీవర్ సర్వే

మర్రిగూడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించినట్లు యూపీహెచ్‌సీ వైద్యుడు దీపక్ తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి 37టీంలు మండల పరిధిలోని 1850 ఇళ్లలో చేశారని తెలిపారు. ఇందులో 12 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశామని తెలిపారు. మండలంలో ఈ ఫీవర్ సర్వే వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో పేద కుటుంబాలకు చెందిన ముషం శ్రీను, కొండ నరసింహ, గైగుళ్ల రమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు స్థానికుడైన హైదరాబాద్‌లో సీఐగా పని చేస్తున్న ఎడ్ల శ్రీనివాస్ బాధిత కుటుంబాలకు శ్రీనివాస ఫౌండేషన్ నుంచి ఒక్కో కుటుంబానికి క్వింటా చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎడ్ల రమేష్, ఎడ్ల ప్రవీణ్, మాదగోని శంకర్, సంతోష్‌రెడ్డి, మాదాసు సైదులు, మాదగోని రమేష్, ఎడ్ల రవి, మాదగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే



నల్లగొండ : సంతోషిమాత ఆలయంలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

- సామూహిక వ్రతాలు ఆచరించిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే కిక్కిరిసిన ఆలయాలు
- మూలనక్షత్రం కావడంతో చిన్నారులకు అక్షరాభ్యాసం

రామగిరి(నల్లగొండ): శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక వస్త్రాల్లో అలంకరించారు. ఆలయాలను సందర్శించుని సామూహిక వ్రతాలు ఆచరించారు. ఇళ్ల వద్ద కూడా అమ్మవారిని ప్రత్యేక అలంకరించుకుని పూజలు చేశారు. పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో మహాలక్ష్మి, సరస్వతీ అమ్మవారి దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా అభిషేకాలు, పూజలు చేశారు. మూల నక్షత్రం రోజు కావడంతో సరస్వతీ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు.

సంతోషిమాత ఆలయంలో...

శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని షేర్ బంగ్లా సంతోషిమాత అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కారంపూడి మోహనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో...

క్రాంతినగర్ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నూనె రంగయ్య, కార్యదర్శి వెంకట్ రావు, టీటీడీ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సేవలనాయక్, వేదాంతం సుదర్శనాచార్యులు, అర్చకులు కోట నాగరాజు పాల్గొన్నారు .

ఘనంగా వరలక్ష్మి పూజలు

మునుగోడు: మండలంలోని మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. తమ ఇళ్లలో లక్ష్మీదేవి పటాలను ఏర్పాటు చేసుకుని అందంగా అలంకరించి నైవేద్యం వండిపెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. తోటి మహిళలకు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

చిట్యాల: పట్టణంలోని శ్రీకనకదుర్గా ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు ఒడిబియ్యం పోశారు. ఈ పూజ కార్యక్రమాలలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం-పుష్ప దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు వాసుదేవశర్మ ఆశ్వీరచనం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మారగోని అంజనేయులు, మేనేజర్ నాగిరెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

నేరడలో..

మండలంలోని నేరడ గ్రామంలోని శ్రీమహామ్మాయి శాంభవి దేవి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెండోట సత్యనారాయణ, చోల్లేటి శివకిరణ్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వత్రాలను నిర్వహించారు.

నాంపల్లి : శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా జరిపారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెల్ది సత్తయ్య, జాల కృష్ణయ్య, పెద్దిరెడ్డి అనంతరెడ్డి, జంగారెడ్డి, గిరి ఉన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వరలక్ష్మీ వ్రతమును ఆ పాఠశాల యాజమాన్యం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

నకిరేకల్‌లో..



తన నివాసంలో వ్రతం అనంతరం అమ్మవారికి మొక్కుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలో పలు గృహాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెలే వేముల వీరేశం స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఆయన సతీమణి పుష్ప నిర్వహించిన ఈవ్రత వేడుకల్లో ఎమ్మెల్యే వీరేశం పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : మండల పరిధి చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. అదే విధంగా నార్కట్‌పల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, మాంద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో, జువ్విగూడెం ఉమా మహేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, జానకిరామశర్మ, భగవన్‌శర్మ, నర్సింహ్మాచార్యులు, అనంతచార్యులు ఉన్నారు.



చెర్వుగట్టు ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



నల్లగొండ : పూజలు చేస్తున్న భక్తులు



మునుగోడులో..



చిట్యాలలో..



నల్లగొండ : అమ్మవారికి ఒడి నింపుతున్న భక్తులు



నల్లగొండ : అమ్మవారికి వాయినం ఇస్తున్న భక్తులు

స్వచ్ఛదనం కోసం.. పచ్చదనాన్ని తొలగించారు !

- చండూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలోని కానుగ చెట్ల తొలగింపు
- పోలీసుల తీరుపై విమర్శలు



చండూరు పోలీస్‌స్టేషన్ ఎదుట తొలగించిన చెట్లు

చండూరు : ఓ పక్క ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం పేరుతో విరివిగా మొక్కలు నాటిస్తుంటే మరో పక్క చండూరు పోలీసులు శుభ్రత పేరిట పచ్చని చెట్లను తొలగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చండూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో గతంలో హరితహారంలో భాగంగా అధికారులు మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరిగి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు నీడ ఇస్తున్నాయి. అయితే రాత్రి సమయాల్లో పాములు, తేళ్లు వస్తున్నాయని శుక్రవారం స్టేషన్ ఆవరణలోని కానుగ చెట్లను తొలగించారు. మొక్కలు నాటడం అటుంచితే..పెరిగిన చెట్ల తొలగింపుపై పోలీసుల తీరును పలువురు తప్పు పడుతున్నారు.

విషకీటకాలు వస్తున్నాయి

స్టేషన్ ముందు ఉన్న కానుగ చెట్లకు ఆనుకుని ఉన్న వేప చెట్టు పెరగడం లేదు. రాత్రి సమయాల్లో పాములు, తేళ్లు వస్తున్నాయి.సెంట్రీ భయపడుతున్నారు. ఇటీవల తాసు పాము వచ్చింది. స్టేషన్ చుట్టూ కంపచెట్లు పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. కావాలని చెట్లను తొలగించలేదు. స్టేషన్‌ను పచ్చగా ఉంచడమే మా లక్ష్యం.

– సీఐ, వెంకటయ్య, చండూరు

సీఎం వ్యాఖ్యలు సిగ్గు చేటు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : రుణమాఫీ విషయంలో మాజీ మంత్రి హరీష్‌రావును ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు, రైతులను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఆగస్టు 15నాటికి రాష్ట్రంలోని రైతుల రూ.31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ఊదరగొట్టి అందులో రూ.9వేల కోట్లు కోత పెట్టాడని విమర్శించారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

లెప్రసీ కాలనీలో నోట్ బుక్స్ పంపిణీ

నల్లగొండ టూ టౌన్ : పట్టణంలోని మూడో వార్డు శేషమ్మ గూడెం బీజేపీ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం లెప్రసీకాలనీలోని 46మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు పర్వతం శరత్ కుమార్, కొప్పు సంతోష్, పేర్ల ప్రభంజనం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చండూరు(గట్టుప్పల్) : చండూరు మండల కేంద్రంలోని ఉప్పల గట్టుకు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం తహసీల్దార్ రాములు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నామన్ జగన్నాథం, డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సామల యాదయ్య, నాయకులు నామని బుచ్చయ్య, దోర్నాల అంజయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

డీపీఆర్ ఆమోదించాలని సంతకాల సేకరణ

నాంపల్లి : డిండి ఎత్తి పోతల పథకం కింద చేపడుతున్న రిజర్వాయర్లకు డీపీఆర్‌ను ఆమోదించాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో శుక్రవారం సంతకాల సేకరణ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కొమ్ము లక్ష్మయ్య, పల్లేటి వెంకటయ్య ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా మండల కమిటీ ఎన్నిక

చండూరు : బీజేపీ ఎస్సీ మోర్చా మండల కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపర్తి యాదగిరి సమక్షంలో మండల అధ్యక్షుడు గుండెల యాదగిరి ప్రకటించారు. మోర్చా మండల ప్రధాన కార్యదర్శులుగా పులిజాల రవీందర్, అశిక శివకృష్ణ, ఉపాధ్యక్షులుగా పోలె సురేష్, ఎల్వర్తి మల్లికార్జున్, గుండమల్ల సంపత్, పందుల కష్ణ, కార్యదర్శులుగా ఇరిగి కిరణ్, ఆక రాజు, వర్కాల స్వామి, జిల్లా సైదులును ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న మోదీ

నల్లగొండ టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగూరి నర్సింహ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.70వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. పథకానికి రూ.2.70 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎల్ఆర్ఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

- నల్లగొండ ఆర్డీఓ రవి



కేతేపల్లి : ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో మాట్లాడుతున్న నల్లగొండ ఆర్డీఓ రవి

కేతేపల్లి: ఇంటి ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని నల్లగొండ ఆర్డీఓ రవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ సర్వేపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆర్డీఓ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ కోసం గ్రామాల వారీగా బాధితులు చేసుకున్న దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం మండల వ్యాప్తంగా 1171 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ సర్వేకు వెళ్లే ముందు ఒక రోజు ముందుగానే దరఖాస్తుదారులకు సమాచారం అందించి వారు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో ఖాళీ స్థలం కొలతలు, హద్దులు పక్కాగా నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ధరణి సమస్యలపై అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి ఉన్నారు.

ఆలయాలపై దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై జరిగిన దాడిని ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కల్లుగీత సొసైటీలకు భూములు కేటాయించాలి

చిట్యాల: తాటి వనాలను పెంచేందుకు కల్లుగీత సొసైటీలకు ఐదెకరాల చొప్పు భూమి కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పామనగుళ్ల అచ్చాలు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 2న ప్రారంభమైన అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర శుక్రవారం చిట్యాలకు చేరుకున్న సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. మామిడి హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కప్పల లింగంగౌడ్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, పాలకూరి వెంకటయ్య, కొంపెల్లి వెంకన్న, వడ్డెగోని శంకరయ్య, మాదగోని దేవయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి) కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు మామిళ్ల సత్తిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి హైస్కూల్‌లో 2024 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు సిద్దార్థ్, సింధూజ, ఇంద్రజకు సంస్థ తరఫున ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తే మిగతా విద్యార్థులు స్ఫూర్తి పొందే అవకాశం ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ బడిలోని పరిస్థితులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రహరీ ఎత్తు పెంచేందుకు రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వాన్ సంస్థ సభ్యులు తదితరులు ఉన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



మునుగోడు: నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు కుమార్ అన్నారు. శుక్రవారం వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెంబళ్ల జానయ్య, బొడిగే అశోక్ గౌడ్, మాదగోని నరేందర్‌గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

చండూరు : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చండూరులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పందుల సత్యం గౌడ్, కోమటి వీరేశం, సముద్రాల వెంకన్న, కారింగ్ విజయ్, వేణు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల: ఫొటోగ్రాఫర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన మండల ఫొటోగ్రాఫర్‌ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ ఆధ్వర్యంలో చిట్యాల మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధానకార్యదర్శిగా కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లిగస్వామి, కుటుంబ భరోసా ఇంచార్జ్ చిలువేరు కృష్ణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి ఎలియాస్, గౌరవ సలహాదారు పున్న రామకృష్ణ, జిల్లా కార్యదర్శి పుట్ట మోహన్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీమన్నారాయణ, గుమ్మడవెల్లి శ్రీనివాస్, వేణుమాధవ్, యేళ్ల బయ్యన్న, సుఖేందర్‌రెడ్డి, అనంద్ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అయోమయంలో అంగన్‌వాడీ ఆయాలు

- 65ఏళ్లు పైబడిన వారిని ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయం
- మునుగోడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 19మంది ఆయాల గుర్తింపు
- గత జూలై నుంచి విధుల్లోకి రావొద్దని అధికారుల ఆదేశం
- విరమణ వయస్సు లేదని ఓటరు, ఆధార్ కార్డులు చూపుతున్న ఆయాలు



మునుగోడులోని అంగన్‌వాడీ కేంద్రం

మునుగోడు: కొన్నేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న పలువురు ఆయాలు రెండు నెలలుగా అయోమయంలో పడ్డారు. గత మే మాసంలో ప్రభుత్వం 65 ఏళ్లు పైబడిన ఆయాలతో పాటు టీచర్లతో ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయించింది. అయితే ఆయాలకు విద్యార్హత సర్టిఫికెట్లు లేకపోవడంతో వారిని ఉద్యోగ విరమణ చేయించడం అధికారులకు తలనొప్పిగా మారింది. అధికారుల అంచనా ప్రకారం కొందరిని 65ఏళ్ల పైబడిన వారిగా గుర్తించారు. కానీ కొందరి ఆధార్, ఓటరు కార్డుల్లో 55 ఏండ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు మాత్రమే ఉంది. తమకు 65 ఏళ్లు నిండకపోయినా ఎలా తొలగిస్తారని ఆయాలు ప్రశ్నిస్తున్నారు.

జూలై నుంచి..

మునుగోడు ప్రాజెక్టు పరిధిలో 169 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 140 కేంద్రాల్లో ఆయాలు పనిచేస్తున్నారు. అందులో 19 మంది 65 ఏళ్లు పైబడిన వారిగా గుర్తించారు. వారందరినీ గత జూలై మాసం నుంచి విధులకు రావొద్దని సంబంధిత అధికారులు కేవలం నోటి మాట ద్వారా చెప్పారు. అంతే కాకుండా ఆ 19 మందికి వేతనాలు కూడా ఇవ్వడం లేదు. దీంతో మాకు ఉద్యోగ విరమణ వయస్సు రాకున్నా అధికారులు కావాలనే తమని విధులకు రానివ్వడం లేదని, వయస్సు ధ్రువీకరణకు ఆధార్, ఓటరు ఐడీ కార్డులను చూపుతున్నారు. కానీ వాటిని ఐసీడీఎస్ అధికారులకు పరిగణలోకి తీసుకోవడం లేదు. వాటిలో తప్పుడు పుట్టిన తేదీలు ఉంటాయని, వైద్యుల చేత ఎముకల పరీక్షలు చేసి వయస్సు నిర్ధారిస్తామని చెబుతున్నారు. అందు కోసం గత జూన్ నెల 27, 28 తేదీల్లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ 19 మందికి ఎముకల పరీక్షలు చేశారు. కానీ అందుకు సంబంధించిన ఫలితాలను నేటికీ ఇవ్వకుండా పరీక్షకు ఉపయోగించిన ఫిల్మ్ కాలిపోయిందని తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులు ఇచ్చిన ఆధార్, ఓటరు కార్డుల్లోని జనన తేదీలు తప్పులై ఉంటే వాటిని ప్రభుత్వం తమకు ఎందుకు ఇచ్చిందని ఆయాలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తమను నెల రోజుల కాలంగా పనిచేయకుండా, వేతనం ఇవ్వకుండా పస్తులు ఉంచుతున్న అధికారులపై చర్య తీసుకొని విధుల్లోకి తీసుకోవాలని ఆయాలు కోరుతున్నారు.

ఎముకల పరీక్షలు చేసి నిర్ధారిస్తాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 65 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగ విరమణ చేయించేందుకు మా ప్రాజెక్టు పరిధిలో 19 మంది ఆయాలని గుర్తించాం. వారికి త్వరలో ఎముకుల పరీక్షలు నిర్వహించి వయస్సుని నిర్ధారిస్తాం. గత నెల 27,28 తేదీల్లో పరీక్షలు చేశారు. కానీ ఫిల్మ్ కాలిపోయిందని చెప్పారు. కొందరు ఆయాలు వయస్సు ధ్రువీకరణకు ఆధార్, ఓటరు కార్డు చూపిస్తున్నారు. వాటిని మేము పరిగణలోకి తీసుకోలేం.

– డి.లావణ్య, సీడీపీఓ, మునుగోడు ప్రాజెక్టు

జూలై నుంచి పనిచేయనివ్వడం లేదు



నాకు ఇంకా 65 ఏళ్లు నిండనేలేదు. నా ఆధార్, ఓటరు కార్డుల్లో 55ఏళ్లు మాత్రమే ఉన్నాయి. అయినా అధికారులు గత జూలై నుంచి విధుల్లోకి రానివ్వడం లేదు. దీంతో పస్తులు ఉండాల్సి వస్తుంది.

–చెన్నారపు కళమ్మ,ఆయా, సుంకెనపల్లి